క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో గాంధీ జయంతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సోమవారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం ఆరో అంతస్తులో గాంధీ చిత్రపటానికి ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు, ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే జేవీవీ ఆశయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ప్రధాన ఆశయమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం జేవీవీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్‌కు సంతాపం తెలిపారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ సైన్స్‌పై దాడి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో మేధావులు, విద్యావంతులు సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. సమావేశంలో శాస్త్ర విజ్ఞానాన్ని రాష్ట్రంలో నలుమూలాల వ్యాప్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 12 విభాగాలకు సబ్ కమిటీ కన్వీనర్లను నియమించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, పూర్వ అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్, మాజీ ప్రధాన కార్యదర్శులు గొంటి మురళీధర్, కె.శ్రీనివాస్, ఎస్.ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

271 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

కంకిపాడు: పట్టణంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పోరంకికి చెందిన అమృత హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరంలో 271 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కృపాలిన్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. మందులను సోషల్ వర్కర్ రాము అందించారు. శిబిరాన్ని ఆక్యుపంక్చర్ వైద్యులు సత్యనారాయణ, భగవాన్, వీరకుమారి పర్యవేక్షించారు.

వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక గ్రామానికి చెందిన బండారు పద్మ విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన రంగారావును 2008 సంవత్సరంలో కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త రంగారావు, అత్త పైడమ్మ, ఆడపడుచు రమణ, ఆమె భర్త నారాయణరావు వేధించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన వివాహిత షేక్‌మస్తాన్‌బి గత పది రోజుల క్రితం సనత్‌నగర్‌కు వచ్చి కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే ఆమె గతంలో గోసాల వైకుంఠపురంలో ఉన్న సమయంలో తాపీమేస్త్రీగా పని చేస్తున్న అబ్దుల్లా ఆమె వెంటపడేవాడు. మస్తాన్‌బి సనత్‌నగర్‌కు వచ్చిన తరువాత కూడా ఆమె ఇంటి వద్దకు వచ్చి ఆమెను వేధిస్తూ ఫోన్‌లు చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

నున్న(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణ బిల్లును శీతాకాలంలో జరగబోయే చివరి పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని గన్నవరం నియోజకవర్గం మహాజన సోషలిస్టు పార్టీ ఇంచార్జ్ మంద వేణుబాబు అన్నారు. సోమవారం నున్న గ్రామంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ రూరల్ మండల నాయకులు చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, తగరం విజయ్‌కుమార్ మాదిగ, దావీదు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన గాంధీ

- ఎమ్మెల్యే వెలంపల్లి
- గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గాంధీజీ తన బోధనలతో ప్రపంచాన్ని ప్రభావితం చేశారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన గాంధీ జయంతిని పురస్కరించుకుని వంకదార వాసుదేవరావు సహకారంతో ఏర్పాటు చేసిన గాంధీజీ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రాన్ని తీసుకురావడానికి గాంధీజీ శాంతియుత మార్గంలో పోరాడారన్నారు. దేశంలోనిఅన్ని వర్గాలను ఉద్యమానికి సమీకరించి నాడు ఎందరికో మహాత్మాగాంధీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం నేటి యువతకు ఆదర్శమని వివరించారు.

ఆర్యవైశ్యులకు క్షమాపణ చెప్పాలి

ఆర్యవైశ్యులకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలని వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యులు అంటే సేవతత్పరులన్నారు. అటువంటి వారిని అవమానపరిచే విధంగా జనసేన నేతలు మాట్లాడటం తగదని హితవు పలికారు. రోశయ్య విగ్రహం ఏర్పాటు చేసే సమయంలో గాంధీ విగ్రహం కరిగించామంటూ జనసేన నేతలు అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. చాలా దిగజారి మాట్లాడారన్నారు. దాన్ని పవన్‌కల్యాణ్ ఖండించక పోవడం దారుణమన్నారు. తక్షణమే ఆర్యవైశ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దాన ధర్మాలు చేయడంలో ఆర్య వైశ్యులు ముందుంటారని, అటువంటి వారిని కించపరిస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర, స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

వించిపేట(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన చిట్టినగర్‌లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెండు జ్యోతి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పిళ్లా దినేష్, రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం నాని, బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షురాలు షేక్ నాగూర్‌బి, పొట్నూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సెయింట్ థామస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో సోమవారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజు డేవిడ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఇలిపిల్ల సూర్యనారాయణ, బోయి రవి, పోతిన కామేశ్వరరావు.. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 36 మంది విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, కుమార్ రాజా, శ్రీనివాస్, ఇర్ఫాన్ పాషాలు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్రపటానికి సీపీ టీకే రాణా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతీయులందరూ గౌరవించే గొప్ప వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ అన్నారు. అలాంటి మహానుభావుల ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో డీసీపీ విశాల్ గున్ని, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని గాంధీహిల్‌పైన గాంధీ పర్వత సంస్థ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గాప్రసాద్, వీహెచ్‌పీ నేత కొంపెల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- 51వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గాంధీ జయంతి సందర్భంగా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో సోమవారం గాంధీజీ చిత్రపటానికి ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్వీ శేషగిరిరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రమేష్, వెంకటేశ్వరరావు తదితరులు గాంధీకి నివాళులు అర్పించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వెంకటేశ్వరరావు, సెక్రటరీ సందక కృష్ణ, ట్రెజరర్ వై సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కే ఇనయతుల్లా, సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీ టీకే రాణా



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న గోకరాజు గంగరాజు,



చిట్టినగర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

గాంధీజీ జీవితం ఆదర్శప్రాయం



ఎస్ఏఎస్ కాలేజీలో గాంధీ దీక్షలను విరమిస్తున్న విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని గాంధీ దీక్షల వ్యవస్థాపకుడు, గాంధీజీ ఆలయ వ్యవస్థాపకుడు రాంపిళ్ల జయప్రకాష్ పేర్కొన్నారు. పాలప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీజీ ఆలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గాంధీజీ దీక్షలను విరమించారు. తొలుత గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. గాంధీ ఆశయాలను విశ్వవ్యాప్తం చేయడానికి దీక్షలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజ్మీరా రాంపండు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సెక్రటరీ గోళ్ల నారాయణరావు, ముక్కామల పెద్దబాబు, కోడూరి రామ్మోహనరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విశ్వ మానవాళి కోసం గాంధీ హోమం చేశారు రాంపిళ్ల జయప్రకాష్ ఆధ్వర్యంలో ఉప్పలూరి లక్ష్మీ నారాయణ హోమాన్ని నిర్వహించారు. గాంధీజీ నిత్య పూజ విధానం పుస్తకాన్ని ఆవిష్కరించారు.



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీకాంత్



నివాళులర్పిస్తున్న మరుపిళ్ల రాజేష్ తదితరులు



పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సన్మానిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): పరిసరాలను శుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. సోమవారం వీఎంసీ ఆధ్వర్యాన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఎ.పి.డి.ఐ.సి చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందరు కాలువ వెంబడి ఉన్న ఈ పార్క్‌ను తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో తీసుకురావటం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవను ప్రణాళిక ప్రకారం దిగ్విజయంగా నిర్వహించారని ఇందులో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములు చేయటం హర్షణీయమన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో, గాంధీ హిల్, కెనాల్ బండ్స్ తదితర ప్రాంతాలలో 15 రోజుల నుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శనివారం గంట శ్రమదానం ద్వారా బస్‌స్టాండ్ ప్రాంతంలో శుభ్రం చేశామన్నారు. పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, క్లాప్ సిబ్బందిని సన్మానించారు. అనంతరం సోషల్ మీడియా ద్వారా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించి, పారిశుద్ధ్య సిబ్బందికి రెయిన్ కోటులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు తాటిపర్తి కొండారెడ్డి, పుప్పల నరసకుమారి, వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, అదనపు కమిషనర్ (జనరల్) కె.వి.సత్యవతి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఎస్టేట్ ఆఫీస్ శ్రీనివాస్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పర్యావరణ పరిరక్షణ

బీబీఏ అధ్యక్షుడు సుందర్



కోర్టు ప్రాంగణంలోపరిసరాలను శుభ్రపరుస్తున్న న్యాయవాదులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) అధ్యక్షుడు కేబీ సుందర్ తెలిపారు. జాతి పిత మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను సోమవారం విజయవాడ కోర్టు ప్రాంగణంలోని బీబీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీబీఏ గవర్నింగ్ బాడీ సభ్యులు కోర్టు కాంప్లెక్స్‌లో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ప్రతి నెలా మొదటి శనివారం కోర్టు పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రమదానం చేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో బీబీఏ వైస్ ప్రెసిడెంట్ పుప్పాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, జాయింట్ సెక్రటరీ నరహరశెట్టి జ్యోతి, ఆకుల పాండురంగ విఠల్, బత్తుల వెంకటేశ్వర్లు, పి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కేసరపల్లిలో కార్మికులకు దుస్తులు అందజేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

గన్నవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి, గన్నవరం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 106 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రోటరీక్లబ్ ద్వారా దుస్తులను సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య విధులు నిర్వర్తించిన తీరు మరువలేవమన్నారు. ఈ సేవలకు గుర్తుగా తమవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, గన్నె వెంకట్రావు, నెక్కలపూడి ఈశ్వరరావు, గొట్టం రవిబాబు, ఈఓలు మౌనిక, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధీ ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటింపు

- గొల్లపూడిలోని వైఎస్సార్ సీపీ నేతలు
- గజదొంగకు మద్దతుగా చిల్లర దొంగల దీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతిపిత మహాత్మగాంధీ ఆత్మకు శాంతి కలగాలని వైఎస్సార్ సీపీ నేతలు మౌనం పాటించారు. గొల్లపూడిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గజదొంగకు మద్దతుగా చిల్లర దొంగల దీక్షలు టీడీపీ నాయకులు చేయడంతో గాంధీ మహాత్ముని ఆత్మ ఘోషిస్తోందన్నారు. శాంతి కాముకుడు, అహింసావాది, నిరాడంబర జీవితం గడిపిన జాతి నేతకు ఈ దొంగ దీక్షలనుంచి ఆత్మ శాంతించాలని వారు మౌనం పాటించారు. టీడీపీ నేతలకు కనువిప్పు కలిగేలా చేసి, తప్పును ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పి, దొంగలించిన డబ్బులు ప్రభుత్వానికి చెల్లించేలా బుద్ధి ప్రసాదించాలని దేవుని ప్రార్థించారు. టీడీపీ నేతల అబద్ధాలు, జిమ్మిక్కులకు కాలం చెల్లిందని, ప్రజలను మోసాలతో మభ్యపెట్టలేరని వారు పేర్కొన్నారు. వేడుకల్లో గొల్లపూడి వైఎస్సార్ సీపీ నాయకులు జి.శివాజీ, కె.సురేష్, వి.సురేష్, బి.వెంకట్రావు, డి.చౌదరి, కె.రామ్మోహన్, జి.సుమన్, ఆదినారాయణ, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని క్యాపో సొసైటీ అధ్యక్షుడు, 5వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా క్యాపో సొసైటీ ఆధ్వర్యంలో లైన్స్‌క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు.

ప్రభుత్వ సేవలు చేరువ చేసిన సీఎం జగన్



కేక్ కట్ చేస్తున్న సంఘం నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలను సకాలంలో ప్రజలకు చేరేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డెమొక్రటిక్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసఫ్ కిషోర్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. సచివాలయంలోని ఉద్యోగులు కేక్ కట్ చేశారు. జోసఫ్ కిషోర్ మాట్లాడుతూ అవినీతి రహితంగా ప్రజలకు సేవలు చేరాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి వార్డు, గ్రామ సచివాలయాలను ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోని లక్షా ముప్పై వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.రాజ్యలక్ష్మి, కోశాధికారి టి.దుర్గాప్రసాద్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.నూతన్‌కుమార్ రెడ్డి, సత్యనారాయణ, పి.శామ్యూల్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న పురందేశ్వరి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని మహిళలకు సోమవారం కుట్టుమిషన్లు, పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కుట్టుశిక్షణ పొందిన పేద మహిళలకు మిషన్లు అందచేయడం అభినందనీయమని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని పురందేశ్వరి పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గొలగాని రవికృష్ణ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్‌బాజీ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి నాగభూషణం, మిట్ట వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సిటీబస్సు సర్వీస్‌లో ప్రయాణికులకు లక్కీ డ్రా స్కీం ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం పి.శివాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూట్ నంబర్ 252 (కా.మార్కెట్-హనుమాన్‌జంక్షన్ వయా ఏలూరు రోడ్డు), రూట్ నంబర్ 252బీ (కా.మార్కెట్- హనుమాన్ జంక్షన్ వయా బందర్ రోడ్డు)లో ప్రయాణించే వారికి ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ప్రయాణికులు తమ టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

కష్టపడితే ఉన్నత శిఖరాలు



ఉయ్యూరు: లక్ష్య నిర్దేశంతో కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. పట్టణంలోని ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరంలో హెబ్రోను యూత్ రిట్రీట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనాగీతాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రార్థనా గీతాలు ఆలపించే వారిలో ప్రతిభను వెలికితీయటమే యూత్ రిట్రీట్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జీవితంలో గెలుపోటములు సహజమన్నారు. లక్ష్యం లేకుండా జీవితంలో ప్రయాణం చేసే వారు విజయాన్ని చేరుకోలేరన్నారు. కార్యక్రమంలో హోప్ ఆసుపత్రి అధినేత, ఫాదర్ జాన్‌డేవిడ్, డాక్టర్ జ్యోతి, సంఘ ప్రతినిధులు సాంబశివరావు, నిరీక్షణరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.